
సాక్షి ఒడిశా
ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,30,605లు, బంగారం 35.95 గ్రాములు, వెండి 40.9 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



కళలకు పుట్టినిల్లు.. ఒడిశా - 8లో.



రూ.18 లక్షల గంజాయి పట్టివేత - 8లో.

న్యూస్‌రీల్

గిరిజనులకు చిక్కిన వేట పక్షి



అటవీశాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్న వేట పక్షి

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి పూజరిగూడ సమీపంలో ఉన్న అడవిలోకి స్థానిక గిరిజనులు వంట కలప నిమిత్తం శనివారం ఉదయం వెళ్లారు. అక్కడే వారికి నల్లరంగులో వింత పక్షి కనిపించింది. ఎటూ కదల్లేని స్థితిలో ఉన్న పక్షిని చేరదీసి, చిత్రకొండ అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. వెంటనే చిత్రకొండ అటవీశాఖ అధికారి మృత్యుంజయ శెఠి, సిబ్బంది అక్కడికి చేరుకొని, పక్షిని స్వాధీనం చేసుకున్నారు. పరిశీలించగా, గాయాలు తగిలి ఉండటంతో చికిత్స అందించడంతో పాటు తిరిగి చిత్రకొండ జలాశయం సమీపంలో విడిచి పెట్టారు. దీనిని ఇతర పక్షులపై వేటకు ఉపయోగిస్తారని, గాయం తగిలి ఉండటంతో ఎవరో వదిలేసి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. దీనిపై దర్యాప్తు చేస్తామని తెలిపారు.

పొనా సంబరాలపై ప్రచారం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

రాయగడ: ఒడియా ప్రజల నూతన సంవత్సరాది పొనా సంబరాలకు సన్నాహాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. పట్టణంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న ఉత్సవాలకు సంబంధించి ప్రచార రథాన్ని నిర్వాహకులు స్థానిక మజ్జిగౌరి మందిరం వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు దేవాశీష్ ఖడంగ, రంజన్‌కుమార్ రథొ, బ్రజ్‌సుందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పూరీ చేరిన నాలుగో విడత కలప



పూరీ బొడొదండొకు చేరుకున్న కలప దుంగలు

భువనేశ్వర్: రథయాత్ర హడావిడి క్రమంగా ఊపందుకుంటోంది. రథాల తయారీకి అంచెలంచెలుగా కలప చేరుతోంది. ఈ క్రమంలో శనివారం నాలుగో విడత కలప పూరీకి చేరింది. ఈ ఏడాది రథాల తయారీకి బౌద్ జిల్లా అటవీ విభాగం సమగ్రంగా 303 కలప దుంగలు సరఫరా చేయాల్సి ఉంది. తొలి విడత కింద 40 అడుగుల పొడవైన 28 కలప దుంగలు సరఫరా చేసింది. మిగిలిన దుంగలు అంచెలంచెలుగా త్వరలో చేరుతాయని అధికారులు తెలిపారు. ఇంతకుముందు విడతల్లో 104 దుంగలు రథాల తయారీ ప్రాంగణానికి చేరాయి. వీటిలో 81దుంగలు కటక్ కపుర్తలా కలప మిల్లుకు తరలించారు. ఏటా 3 కొత్త రథాల తయారీకి 865 దుంగలు అవసరం ఉంటుంది. గత ఏడాది సేకరించిన వాటిలో 118 చెక్క ముక్కలు మిగిలి ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాయగడ: పట్టణంలోని రైతుకాలనీ కూడలిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మృతుడు రాయగడ అంజిపేటకు చెందిన సీహెచ్ గోవింద(31)గా పోలీసులు గుర్తించారు. స్థానికంగా ప్రైవేటు సంస్థలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న అతను.. విధులు ముగించుకుని, శుక్రవారం రాత్రి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో యువకుడు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న అంజిపేట వాసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకు దిగారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు బాధిత కుటుంబానికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రోడ్డుపై బైఠాయించారు. దీంతో రాయగడ మీదుగా కొరాపుట్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని, బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా ఆందోళన విరమించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

రాచరికపు ఠీవితో చారిత్రక వైభవానికి చిహ్నంగా నిలవాల్సిన స్థలానికి చెదలు పడుతున్నాయి. ముగ్ధమనోహరంగా కనిపించే పర్లాకిమిడి గజపతి వంశీయుల రాజ ప్రసాదం ప్రస్తుతం.. శిథిలావస్థకు చేరుకుంది. 1843లో యూరోపియన్ శైలిలో నిర్మించిన ఈ కట్టడం.. కళావిహీనంగా మారింది. దీనిని రాష్ట్రప్రభుత్వం స్వాధీనం చేసుకొని, రాజావారి పురాతన వస్తువులతో మ్యూజియం ఏర్పాటు చేస్తే బాగుంటుందని స్థానికులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. కానీ ఇప్పటి వరకు ఇది కార్యరూపం దాల్చలేదు.

– పర్లాకిమిడి



పర్లాకిమిడి గజపతి ప్యాలెస్

చరిత్రకు చెదలు..!



ప్యాలెస్‌లో దర్బారుహాలు పైభాగంలో విరిగిపోయిన బాల్కనీ



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న దేవదాసీల గదులు



నిర్వాహణకు నోచుకోని కోట వెలుపలి భాగం

- 180ఏళ్ల క్రితం యూరోపియన్ శైలిలో నిర్మించిన పర్లాకిమిడి గజపతి ప్యాలెస్
- మరమ్మతులు చేపట్టకపోవడంతో కళావిహీనంగా మారిన చారిత్రక నిర్మాణం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవాలని స్థానికుల డిమాండ్
- మ్యూజియంగా ఏర్పాటు చేసి, సందర్శకులను అనుమతించాలని వినతులు

గతమెంతో ఘనం.. వర్తమానం వ్యర్థం.. అన్న చందంగా ఉంది పర్లాకిమిడి రాజావారి కోట పరిస్థితి. గతంలో ఎన్నో చారిత్రక ఘట్టాలు, ఉత్కళ రాష్ట్ర ఏర్పాటులో కీలక వేదికగా నిలిచిన ఈ స్థల ప్రాముఖ్యత ఎవరికీ పట్టకుండా పోయింది. దాదాపు 180 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ప్యాలెస్‌లోని రాజ దర్బారు, రాణిమహల్, ఎడమవైపు కొంతభాగం ప్రస్తుతం జిల్లా ప్రజా సంబంధాల శాఖ(డీపీఆర్‌ఓ), ఎల్‌పీజీ గ్యాస్ ఆఫీసు, యూటెక్ కంప్యూటర్స్‌కు అద్దెకు ఇచ్చారు. కుడిభాగంలో సువాసన కలిగిన మొక్కలతో అలరారిన పార్కింగ్ స్థలం మహారాజా కృష్ణచంద్ర గజపతి నారాయణదేవ్ మరణం తరువాత ఆయన తనయుడు గోపీనాథ గజపతి విక్రయించారు. దీంతో కోట శోభ తప్పి, కళావిహీనంగా మారిపోయింది.



దర్బారు హాలులో కళతప్పిన ఎలుగుబంటి బొమ్మ

ఇదీ చరిత్ర..

గజపతి ప్యాలెస్ ప్రతాపరుద్ర గజపతి నారాయణ దేవ్(1771–1802) తన రాజ్యానికి పర్లాకిమిడిని రాజధానిగా ఏర్పరుచుకున్నట్లు చరిత్ర చెబుతోంది. వీరి మనుమడు జగన్నాథ గజపతి నారాయణ దేవ్(1821–1851) పరిపాలనకు వీలుగా పర్లాకిమిడిలో భారీ వ్యయంతో సుందరమైన కోట నిర్మించడానికి తలపెట్టారు. దీనికి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రూ.24 లక్షల 20 వేలను గ్రాంటుగా అందజేశారు. తొలుత రూ.4 లక్షల 50 వేలు బయానాగా ఇచ్చి, రాబర్ట్ ఫెల్లోస్ చెస్లామ్ అనే బ్రిటీష్ ఇంజినీర్, ఆర్కిటెక్ట్‌కు నిర్మాణ బాధ్యతను అప్పగించారు. ఈ రాజకోట భవన పనులు 1835లో ప్రారంభమై రెండు అంతస్తులు, 80 గదులతో 1843 నాటికి కళ్లు చెదిరే రీతిలో నిర్మించారు. యూరోపియన్ మిశ్రమ వాస్తుకళతో నిర్మించిన ప్యాలెస్.. లండన్‌లోని బకింగ్‌హోమ్ కోటకు సరితూగే విధంగా నిర్మాణం ఉంటుంది. దర్బారుహాలు వెనుక కల్యాణ మండపం, పడగ గదులు, వంటగదులు, స్నానపు గదులు, దాసీలు, పరిచాలకులకు ప్రత్యేకంగా మూడు వరుసల్లో గదులు నిర్మించారు. వీటితో పాటు వినోదం కోసం ప్రత్యేకంగా బిలీయర్డ్స్ గదులు, టెన్నిస్ కోర్డులు ఉన్నాయి. కోటను ఆనుకుని ఉన్న డాబాగుడిలో సుమారు 8ఎకరాల్లో క్రికెట్ మైదానం, ఏనుగులు, గుర్రాలు, ఆవుల శాలలతో పాటు వివిధ రకాల విలాసవంతమైన కార్లు నిలుపుదలకు స్థలం ఉంది.

50ఏళ్ల క్రితం..

జగన్నాథ గజపతి నారాయణ దేవ్ కుమారుడు గౌరచంద్ర గజపతి నారాయణ దేవ్(1885–1904), ఆయన కుమారుడు మహారాజా కృష్ణచంద్ర గజపతి(1913–1974) హయాంలో చివరిసారిగా రాజావారి కోట అంతర్భాగం అలంకరణ, మరమ్మతులు జరిగినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. రాజావారి ఏనుగుల రాకపోకలకు వీలుగా 22 అడుగుల సంహద్వారానికి రాజముద్రికతో పాటు బ్రిటీష్ పాలకుల ధర్మసూత్రంగా 'స్ట్రాంగ్ అండ్ ఫెయిత్‌ఫుల్'అనే పదాలతో పెద్ద ఇనుప గేటును ఏర్పాటు చేశారు. సింహద్వారానికి ముందు కాపాలాగా విశ్రాంతి తీసుకుంటూ వాలి ఉన్న రెండు సింహాల రాతి విగ్రహాలు కనిపిస్తాయి. గేటు వద్ద ప్రతి గంటకు ఊరంతటికీ సమయం వినిపించేలా వీలుగా పెద్దగంట, కర్రసమ్మెట అమర్చాయి. కోట గంటలు కొట్టే ఆచరణ ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం గజపతి వంశీయురాలు కల్యాణీదేవి గజపతి ప్యాలెస్ బాధ్యతలు స్వీకరించారు. ఆమె అధికార పార్టీ బీజేడీ కొనసాగుతున్నారు.



జగన్నాథుని సన్నిధిలో యువరాణి కల్యాణీదేవి గజపతి (ఫైల్)

చెన్నైలో మ్యూజియంగా..

గతంలో రథయాత్ర రోజుల్లో రాజావారి కోట దర్బారు హాలు, కోట బురుజులు సందర్శించేందుకు అనుమతి ఇచ్చేవారు. ఇక్కడి నుంచి చూస్తే పర్లాకిమిడి, పాతపట్నం ప్రాంతాలతో పాటు వెనుకభాగంలో సీతాసాగరం కనిపిస్తాయి. చెన్నైలో మెరైన్ బీచ్ ఒడ్డున ఇదే ప్యాలెస్ తరహాలో కృష్ణచంద్ర గజపతి 1873లో మరో ప్యాలెస్ నిర్మించారు. మద్రాసు విశ్వవిద్యాలయం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కోటను పునరుద్ధరించారు. 2006లో అప్పటి భారత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజీ అబ్దుల్ కలామ్ ప్రజలకు అంకితం చేశారు. చెన్నై పరలా రాజాస్ట్రీట్‌లో ఉన్న ఈ ప్యాలెస్‌ను తమిళనాడు ప్రభుత్వం ప్రజా సందర్శనకు వీలుగా మ్యూజియంగా ఏర్పాటు చేసింది. ఇదే తరహా వైభవానికి పర్లాకిమిడి మహారాజా ప్యాలస్ కూడా నోచుకోవాలని పరిశోధకులు, చరిత్రకారులు కోరుతున్నారు.

పురావస్తుశాఖకు అప్పగించాలి..



180 ఏళ్ల క్రితం నాటి పర్లాఖెముండి గజపతి మహారాజుల చారిత్రాత్మక నిర్మాణం గజపతి ప్యాలెస్. ఇది ప్రైవేటు ఆస్తి. గజపతి వంశీయుల ఆధీనంలో ఉండటం వల్ల ప్రభుత్వం అభివృద్ధి పరిచే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. దీనిని రాజ కుటుంబికులు ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా ఈ చారిత్రాత్మక కట్టడాన్ని పరిరక్షించవచ్చు. దీనిపై స్థానికుల నుంచి సైతం గతంలో డిమాండ్లు వినిపించాయి. ప్యాలెస్ ప్రాముఖ్యతను గుర్తించి, పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం, భారతీయ పురావస్తుశాఖ పరిశోధించడంతో పాటు నిధులు మంజూరు చేయాలి. ఇదే జరిగితే.. దక్షిణ ఒడిశాలోనే కీలకమైన పర్యాటక కేంద్రంగా పర్లాకిమిడి ప్యాలెస్ నిలుస్తుందని చెప్పవచ్చు.


– సూర్యనారాయణ పట్నాయక్, జిల్లా అభివృద్ధి కమిటీ చైర్మన్

కృష్ణచంద్ర గజపతి త్యాగానికి గుర్తుగా..




గజపతి ప్యాలెస్ రాష్ట్రంలో ద్వితీయ చారిత్రాత్మక చిహ్నం. పర్లాకిమిడి రాజ ప్రసాదం కేంద్రంగా ఒడిశా స్వతంత్ర భాషా రాష్ట్రం కోసం కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ ఎంతో పోరాటం చేపట్టారు. ఆయన స్మృతులు, త్యాగాలను గుర్తు చేస్తూ చారిత్రాత్మక రాజప్రసాదాన్ని మ్యూజియంగా ఏర్పాటు చేసేందుకు అప్పటి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి సూర్యనారాయణ పాత్రో 1995లో పర్లాఖెముండి మహారాజా గోపీనాథ గజపతికి లేఖ రాశారు. అయితే ఆయన నుంచి ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. దీనికి సంబంధించిన నకలు కాపీ ఇప్పటికీ నాదగ్గర ఉంది. ప్రస్తుత గజపతి వంశీయులు ప్యాలెస్ మరమ్మతులు చేసేందుకు ఆర్థిక పరిస్థితి వల్ల సాధ్యం కాకపోవచ్చు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగిస్తే ఈ ప్రదేశం అభివృద్ధి చెందవచ్చు. ఆ దిశగా చర్యలు సాగాలి.

– పూర్ణచంద్ర మహాపాత్రొ, ఒడిశా ఉత్కళ హితేషిణీ సమాజ్ ప్రహరి, రిటైర్డ్ తహసీల్దార్



రాజావారి కోట వెనుకభాగంలో కల్యాణ మండపం



కోటలో నిరుపయోగంగా ఉన్న ఖరీదైన బర్మా టేకు ఫర్నీచర్



ప్రధాన ద్వారం వద్ద కళావిహీనంగా ఉన్న సింహం విగ్రహం

షూటింగ్‌కు సై



చిత్రీకరణ జరుపుకోనున్న హంతాల్‌గూడ ఘాట్ రోడ్డు

- మల్కన్‌గిరి జిల్లాలో పుష్ప–2 చిత్రీకరణకు అనుమతులు

మల్కన్‌గిరి: జిల్లాలో పుష్ప–2 సినిమా చిత్రీకరణకు అనుమతులు లభించాయి. దీనికి సంబంధించి చిత్ర బృందం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గత 2 రోజులు పర్యటించింది. వీటికి జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్, ఎస్పీ నితీష్ వాధ్వనీకి మైత్రీ మూవీసంస్థ తరపున వినతిపత్రం అందించగా, దీనిపై వారు సానుకూలంగా స్పందించారు. ఒకప్పుడు మావోయిస్టులకు కంచుకోటగా పేరొందిన స్వాభిమాన్ ఏరియాలో టాలీవుడ్ స్టార్ హీరో అల్లూ అర్జున్ చిత్రం షుటింగ్ నిమిత్తం అనుమతులు కోరడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ మేరకు మే మొదటి వారంలో చిత్రకొండ సమితి జంత్రి పంచాయతీ హంతాల్‌గూడ ఘాట్ రోడ్డులో షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. దీనితో పాటు బలిమెల రిజర్వాయర్, చిత్రకొండ పరిధిలోని పలు గ్రామాల్లో చిత్రీకరణకు యోచిస్తున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడక్షన్ మేనేజర్ పి.వేంకటేశ్వరరావు తెలిపారు. పరిశీలనలో ఫైట్ మాస్టర్లు పీటర్ హెయిన్స్, డ్రాగన్ ప్రకాష్, అసిస్టెంట్ డైరెక్టర్ మారిశెట్టి ప్రసాద్, రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ నిర్మాత సుబ్రహ్మణ్యం, కెమెరామన్ దేవరాజ్ పాల్గొన్నారు.



చిత్రకొండ ప్రాంతంలో పర్యటిస్తున్న చిత్ర బృందం

సమ్మెబాటలో ప్రభుత్వ ఫార్మాసిస్ట్‌లు



డిమాండ్లను ప్రదర్శిస్తున్న ఫార్మాసిస్ట్ సంఘం అధ్యక్షుడు జగన్నాథ రథొ, ప్రతినిధులు

కొరాపుట్: ప్రభుత్వ ఆస్పత్రులలో ఫార్మాసిస్ట్‌లు సమ్మె సైరన్ ప్రకటించారు. ఈ మేరకు నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో శనివారం జరిగని మీడియా సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్నథ రథొ మాట్లాడారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించపోతే మే17 నుంచి సామూహిక సెలవులకు దిగుతామని వెల్లడించారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పదవీ విరమణ వరకు ఒకేస్థాయిలో ఉండాల్సివవస్తోందని, పదోన్నతులు లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైందన్నారు. అనుభవం ఆధారంగా ఫార్మాసిస్ట్ లను ఫార్మసీ అధికారిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టాలని కోరారు.

తిరుపతి పాణిగ్రాహికి సత్కారం

పర్లాకిమిడి: శ్రీరామనవమి ముగింపు ఉత్సవాలకు కటక్ జిల్లా కువార్‌పూర్ గ్రామంలో హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వర్(నార్త్) ఎమ్మెల్యే ప్రియదర్శినీ మిశ్రా ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ చితస్మితా ఖటువా, ఓటీవీ రవీంద్ర రాథ్, కె.తన్మయ, రామచంద్ర మానస్, రంజన్ చౌధురి తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి పాణిగ్రాహిని సన్మానిస్తున్న భువనేశ్వర్ ఎమ్మెల్యే ప్రియదర్శినీ మిశ్రా

క్లుప్తంగా

తాటిబెల్లం సహకార సంఘం అధ్యక్షుడిగా ప్రఫుల్ల జెన్నా



ప్రఫుల్ల జెన్నాను సత్కరిస్తున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: రాష్ట్ర తాటిబెల్లం సహకార సంఘం అధ్యక్షుడిగా గజపతి జిల్లా ఆర్.ఉదయగిరికి చెందిన ప్రఫుల్ల జెన్నా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భువనేశ్వర్‌లోని సంఘం ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో ఆయన పేరును జిల్లా తాటిబెల్లం సహకార సంఘం అధ్యక్షుడు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి ప్రతిపాదించారు. దీనిని పలువురు ప్రతినిధులు బలపరిచగా, ఎటువంటి పోటీలేకుండా ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ప్రకటించారు. అనంతరం బీజేడీ రాష్ట్ర కార్యదర్శి మారుత్ పాలొ, పాణిగ్రాహి తదితరులు ఆయనను అభినందించారు.

హడలెత్తిస్తున్న గజరాజులు



పక్కుడుబద్ర జీడి తోటల్లో సంచరిస్తున్న గజరాజులు

భామిని: మండలంలోని పక్కుడుబద్ర జీడి తోటల్లో మకాం వేసిన గజరాజుల గుంపు శనివారం హడలెత్తించాయి. సమీపంలోని నీలంశ్వరాలయం సమీపంలోకి ప్రవేశించిన ఏనుగులను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో పరుగులు పెట్టించాయి. జీడి తోటలను ధ్వంసం చేశాయి. మరో వైపు రబీ పంటలను తీవ్రంగా నష్టపరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న వరలక్ష్మి

పార్వతీపురం: భార్యాభర్తల మధ్య నెలకొన్న చిన్నపాటి వివాదం వివాహిత ఆత్మహత్యా యత్నానికి దారి తీసింది. పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు శనివారం తెలిపిన వివరాలు.. బలిజిపేట మండలం వెంగాపురం గ్రామానికి చెందిన వై.వరలక్ష్మి ఇంట్లో ఉన్న లైజాల్ తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. భార్యాభర్తల మధ్య గొడవ తరువాత భర్త ప్రసాద్ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోవడంతో భార్య లైజాల్ తాగింది. స్థానికులు గమనించి బలిజిపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స తరువాత మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలో 127 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో శనివారం జరిగిన ఇంగ్లిష్ పరీక్ష సజావుగా జరిగింది. రెగ్యులర్ విద్యార్థులు 24,064 మందికిగాను 24,004 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 25 మందికిగాను 15 మంది హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 99.75 శాతం హాజరు కాగా, ప్రైవేటు విద్యార్థులు 60 శాతం హాజరైనట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహారాజ సాంస్కృతిక హైస్కూల్, పీఎస్ఆర్ స్కూల్, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. డీఈఓ ఆరు పరీక్ష కేంద్రాలను, కలెక్టర్ రెండు పరీక్ష కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 69 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఐసీడీఎస్ సూపరింటెండెంట్‌గా పూర్ణచంద్రుడు

పార్వతీపురం: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌గా డి.పూర్ణచంద్రుడు శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరిని కలిసి అభినందనలు తెలిపారు. సిబ్బందితో సమన్వయం చేసుకొని బాధ్యతలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాముకాటుకు గురైన మహిళ మృతి



నారితల్లమ్మ (ఫైల్)

జామి: మండల కేంద్రానికి చెందిన గట్రెడ్డి నారి తల్లమ్మ(35) తన పొలంలో శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటుకు గురైంది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతురాలికి భర్త ముత్యాలునాయుడు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జామి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆకట్టుకున్న బాలికల నృత్య ప్రదర్శనలు



వంటల పోటీల్లో పాల్గొన్న మహిళలు



పోటీలను తిలకిస్తున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు

కళలకు పుట్టినిల్లు.. ఒడిశా

- ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి
- ఉత్సాహంగా సాగుతున్న పొనా సంక్రాంతి సంబరాలు



నిర్వాహకులతో వంటకాల పోటీల విజేతలు



వంటకాల రుచి చూస్తున్న ఎస్‌డీసీ చైర్మన్ మాఝి

రాయగడ: భిన్న సంస్కృతులు కలగలిసిన ఒడిశా.. కళలకు పుట్టినిల్లుగా భాసిల్లుతోందని స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) చైర్‌పర్సన్ అనసూయ మాఝి పేర్కొన్నారు. పట్టణంలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 14 ,15 తేదీల్లో జరగనున్న పొనా సంబరాల్లో భాగంగా స్థానిక కృష్ణచంద్ర నగర భవనం ప్రాంగణంలో మహిళల మధ్య సంప్రదాయ వంటలు, బాల, బాలికలకు నృత్య పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఆదివాసీ సంప్రదాయాలను ఎంతగానో గౌరవిస్తున్నామన్నారు. అందరి ఆరాధ్య దైవంగా కొలుస్తున్న జగన్నాథుని సంస్కృతితో ముడిపడి ఉన్న పొనా సంబరాలు ఈసారి ఘనంగా నిర్వహించుకునేందుకు సన్నాహాలు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. కళలు, భాషా, సంస్కృతిని పరిరక్షించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని, అలాగే భావితరాలకు మార్గదర్శంగా నిలుస్తాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఒడియా సంప్రదాయ వంటలు ఎంతో రుచిగా ఉంటాయని, రసగుల్ల వంటి వాటికి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని గుర్తుచేశారు.

సమైఖ్యతోనే ఉత్సవాలు

ఒడియా ప్రజలకు మొదటి పండగగా గుర్తింపు పొందిన పొనా సంక్రాంతి సంబరాలు ఈఏడాది అందరి సహకారంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యురాలు, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ శుభ్ర పండా తెలిపారు. దీనిలో భాగంగా పోటీలు నిర్వహించామన్నారు. అందరి సమైఖ్యతకు అద్దం పట్టే ఉత్సవాలను తిలకించేందుకు పట్టణంలోని తెలుగు ప్రజలను సైతం ఆహ్వానించామని వివరించారు. ఉత్సవాలు నిర్వాహణలో వారి పాత్ర కూడా ముఖ్యమని తెలియజేశారు.

ఆకట్టుకున్న పోటీలు..

సంబరాల్లో భాగంగా నిర్వహించిన నృత్య పోటీల్లో 25మంది పాల్గొన్నారు. ఒడియా భాషా, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా నృత్య ప్రదర్శనలు చేశారు. సంబల్‌పురి నృత్యాలు, వస్త్రధారణతో అత్యధిక శాతం మంది పిల్లలు పాల్గొనడం విశేషం. అదేవిధంగా ఒడియా ప్రజల దేశీయ గీతాలకు ప్రముఖ్యత కల్పించారు. ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా సెంచురియన్ యూనివర్సిటీ ఎండీ రాజేష్ పాఢి, సర్మిష్టా సస్మాల్, చీరొస్మిత సాహు వ్యవహరించారు. అలాగే ఒడియా ప్రజల వంటకాలకు సంబంధించి నిర్వహించిన పోటీల్లొ 35మంది మహిళలు పాల్గొన్నారు. సంప్రదాయ పిఠా, కక్కర, పుడా పిఠా తదితర వంటకాలు ఆకర్షణగా నిలిచాయి. న్యాయనిర్ణేతలుగా కేకే జెన్నా, సుశ్రీత దాస్, బిద్యులత హుయిక, భారతీ చౌధరి వ్యవహరించారు.

విజేతలు వీరే..

పొనా సంబరాల్లో భాగంగా నిర్వహిలచిన నృత్య పోటీల్లో 30మంది బాల, బాలికలు పాల్గొన్నారు. వీరిలో సంవృద్ధి దాస్ ప్రథమ బహుమతి, దివ్యాంశు సాహు ద్వితీయ, రితికా బెహరా తృతీయ బహుమతి సాధించారు. అలాగే సంవృద్ధి ఛువాలోసి, ప్రజ్ఞాని సాహు ప్రోత్సాహక బహుమతులు కై వసం చేసుకున్నారు. అలాగే ఒడియా సంప్రదాయ వంటకాల పోటీల్లో దీప్తి మహంతి ప్రథమ బహుమతి, సంజుక్త మిశ్రా ద్వితీయ, సంజుక్తా ఛాముండ తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు పొనా ఉత్సవ వేదికపై బహుమతులు అందిస్తామని నిర్వాహకులు దేవాశీష్ ఖడంగ తెలిపారు.

ఎంపికైన వారికి సత్కారం



సన్మాన సభలో మాట్లాడుతున్న సీవా ప్రతినిధులు

జయపురం: రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలో సత్తా చాటడంతో ఉద్యోగాలు సాధించిన పలువురు అభ్యర్థులను జయపురం స్వచ్ఛంద సంస్థ సోషియల్ ఎడ్యుకేషనల్, ఎన్విరాన్‌మెంటల్ అసోసియేషన్(సీవా) ప్రతిధులు సన్మానించారు. ఈ మేరకు శిశు ఉద్యాన పార్కులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమానికి సంస్థ అధ్యక్షుడు సుధాకర పట్నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సర్వీసులో చేరుందుకు ఆసక్తి ఉండీ, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి సీవా ఆధ్వర్యంలో శారీరత, రాత పరీక్షకు శిక్షణ అందించామని తెలిపారు. మొత్తం 40మంది హాజరు కాగా.. 30 మంది ఉద్యోగాలు సాధించారని ఆనందం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో పాటు వారికి శిక్షణ అందించిన ఉపాధ్యాయులు ప్రభాత్ రథ్, ప్రతాప్ పట్నాయక్, సౌమ్యరంజన్ దొలాయి, ఓడ్రాఫ్ అధికారులు రాజేష్‌కుమార్ సాహు లను అభినందించి, సత్కరించారు. నవరంగపూర్‌లో శిక్షణ పొందిన గౌరీశంకర బిశాయి, బైద్యనాథ్ ఖొరా శిక్షణలో తమ అనుభవాలను పంచుకున్నారు. గణితం, ఆంగ్లం, ఒడియా, జనరల్ నాలెడ్జ్, శారీరక శిక్షణ తమకు ఎంతో ఉపయోగ పడ్డాయని వివరించారు.కార్యక్రమంలో సీవా ప్రతినిధులు అజయ మిశ్రా, బును దాస్, ప్రదీప్తి సాహు, జి.వెంకటరెడ్డి, గోపాలసాహు, రమేష్‌సాహు, మురళీ పట్నాయక్, రంజిత్ సాహు తదితరులు పాల్గొన్నారు.

రూ.18 లక్షల గంజాయి పట్టివేత



పట్టుబడిన కారు, గంజాయి, నిందితులతో పోలీసులు

- ఇద్దరు నిందితుల అరెస్ట్ చేసిన పోలీసులు

జయపురం: కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జయపురం సదర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపారు. వీరు మధ్యప్రదేశ్ రాష్ట్ర సియారి జిల్లా దౌలత్‌పూర్ గ్రామం మహేష్ మీనా, దౌరహ గ్రామం కమల్‌సింగ్ గా తెలిపారు. నిందితుల నుంచి రూ.40 వేల నగదు, 2 సెల్‌ఫోన్లు స్వాధీన చేసుకున్నట్లు పేర్కొన్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సదర్ పోలీసు అధికారి శంకర పండా నేతృత్వంలో సిబ్బంది విజయవాడ–రాంచీ 326 జాతీయ కారిడార్ మార్గంలోని పాత్రొపుట్ వంతెన వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. వేగంగా వస్తున్న కారును తనిఖీ చేయగా గంజాయి బస్తాలు కనిపించాయి. వీటిని మేజిస్ట్రేట్ సమక్షంలో తూకం వేయగా 180 కిలోలు ఉండగా, మార్కెట్‌లో రూ.18 లక్షల విలువ చేస్తుదని వివరించారు.

నిధుల దుర్వినియోగంపై ఆందోళన



జగన్నాథ సాగర్ వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

జయపురం: పట్టణంలోని చరిత్రాత్మక జగన్నాథ్ సాగర్ సర్వాంగ ఉన్నతికి ప్రభుత్వరంగ సంస్థ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్)సమకూర్చిన నిధులు దుర్వినియోగం అవుతున్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు పార్టీ నియమించిన నిజ నిర్ధారణ కమిటీ ప్రతినిధులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌతమ్ సామంతరాయ్ నేతృత్వంలో నాయకులు జగన్నాథ సాగర్ అభివృద్ధి పనులు జరుగుతున్న ప్రాంతంలో శనివారం ధర్నా చేపట్టారు. అభివృద్ధి పథకంలో భాగంగా రూ.కోటి 60 లక్షలతో పనులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారని, కంట్రాక్టర్‌కు ఇచ్చిన టెండర్‌లో రూ.కోటి 20 లక్షలకు ఇచ్చారని ఎత్తిచూపారు. 300 రోజుల్లోగా పనులు పూర్తి చేయాలని 2022 ఆగస్టు 10న ఆదేశాలు జారీ చేశారని, అయితే గడువు సమీపిస్తునా నేటికీ పూర్తి కాలేదని విమర్శించారు. దీనితో పాటు పనుల్లో నాణ్యత లోపించిందని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దళితులు, ముస్లింలపై దాడులు తగవు

విజయనగరం పూల్‌బాగ్: దేశంలో మోదీ నేతృత్వంలో దళితులు, ముస్లింలపై జరుగుతున్న హత్యలు, పైశాచిక దాడులను ఐక్యంగా ప్రతిఘటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జె.ఈశ్వరయ్య, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ, డీహెచ్పీఎస్ అధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా సీపీఐ కార్యదర్శి ఓమ్మి రమణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జె. ఈశ్వరయ్య, జేవీ ప్రభాకర్ మాట్లాడుతూ మూడున్నరేళ్లలో దళితుల, ముస్లింలపై హత్యలు, పైశాచికంగా దాడులు జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా రాజకీయ పదవులు, అధికార పదోన్నతులు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 11న తలపెట్టిన చలో విజయవాడకు దళిత సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సురగడ రమేష్‌కుమార్, ముస్లిం జమాత్ కమిటీ నాయకులు రహమాతుల్ల, కరీం భాయ్, ఆప్ నియోజకవర్గ కన్వీనర్ టి.కోటేశ్వరరావు, లోక్‌సత్తా పార్టీ నాయకులు రాజారావు, సీపీఐ సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోకా రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దొండనచొ దీక్షలు



మధ్యాహ్నం ఎండలో దీక్షలు చేస్తున్న భక్తులు



గాంధీనగర్‌లో దొండనచొ పూజలు

బరంపురం: గంజాం జిల్లా ప్రసిద్ధి చెందిన చైత్ర మాస దొండనచొ దీక్షలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్ర, శనివారాల్లో నగరంలోని గాంధీనగర్, హరడాఖండి, సిటీ హాస్పిటల్ రోడ్డు, పాడు వీధుల్లో దీక్షాధారుల ప్రదర్శనలు జరిగాయి. సంప్రదాయాలకు అనుగుణంగా మిట్ట మధ్యాహ్నం ఎండలో కఠోర దీక్షాలు చేశారు. గడ్డి ఉండలతో అగ్నికీలల ప్రదర్శనలు చేశారు. ఉదయమంతా ఉపవాసాలు చేపట్టి, సాయంత్రం చెరువుల్లో స్నానాలు చేశారు. అనంతరం ప్రసాద స్వీకరణ, రాత్రి దొండకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు, సంస్కృతిక నాటక ప్రదర్శనలు జరిపారు.

పోస్టుమార్టం నివేదిక కోసం ఎదురుచూపులు



సదర్ పోలీసు స్టేషన్ వద్ద మృతురాలి భర్త, బంధువులు

జయపురం: పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సమయంలో అపస్మారక స్థితిలోకి చేరుకొని, మరణించిన లమతాపుట్ సమితి సురియతేజ బొడొనాయక్ ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఆమె పోస్టుమార్టం రిపోర్టు వెంటనే అందజేయాలని జిల్లా ఆస్పత్రి ప్రధాన అధికారికి లేఖ రాసారని సమాచారం. ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, దర్యాప్తు నివేదిక సమర్పించాలని కోరారు. దర్యాప్తు, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేస్తామని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపారు. మృతురాలి భర్త రామరాజు బొడొనాయక్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం రిపోర్టులో సురియతేజ మరణానికి కారణాలు వెల్లడికావచ్చని బాధిత కుటుంబీకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని రెడ్డివానివలస గ్రామానికి చెందిన రెడ్డి మహేశ్వరరావు(మధుసూదనరావు) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. దీనికి సంబంధించి ఎస్ఐ శనివారం తెలిపిన వివరాలు... గత నెల 30న 36వ నంబరు రాష్ట్ర రహదారిలో పణుకుపేట జంక్షన్ వద్ద పార్వతీపురం వైపు నుండి బొబ్బిలి వెళ్తున్న మోటారుసైకిలిస్ట్ ఢీకొన్న ప్రమాదంలో మధుసూధనరావు గాయాల పాలయ్యాడు. గాయాల పాలైన మధుసూదనరావును కుటుంబీకులు పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి సీతానగరం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం రిఫర్ చేశారన్నారు. అక్కడ చికిత్స పొందుతుండగా శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు శనివారం సమాచారం వచ్చిందన్నారు. కేజీహెచ్‌లో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు.

సీతంలో ముగిసిన 'హ్యాకథాన్' టెక్నో పోటీలు

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహించిన 'హ్యాకథాన్–2023' శనివారం ముగిసింది. బ్రెయిన్ ఓ విజన్ సంయుక్త నిర్వహణలో శిక్షణ మరియు స్మార్ట్ విజయనగరం అంశంగా జరిగిన కార్యక్రమంలో దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి ఒక్కొక్క బృందం వారీగా పోటీపడ్డారు. ఒక్కో బృందం విజయనగరంలో ఒక వ్యాపారాన్ని ఎంచుకుంది. దాని కోసం ఒక ఇంటరాక్టివ్ వెబ్‌సైట్‌ను రూపొందించాయి. ఈ అభ్యాసం వారికి వెబ్ డెవలప్‌మెంట్ యొక్క ఎండ్ టు ఎండ్ అనుభవం సంగ్రహావలోకనం ఇచ్చింది. బ్రెయిన్ ఓ విజన్ బృందం మరియు ఈ సంస్థ సీఈఓ గణేష్ నాగ్ నేతృత్వంలో వెబ్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులకు తక్కువ కోడ్/నో-కోడ్ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చారు. బ్రెయిన్ ఓ విజన్ ఎగ్జిక్యూటివ్స్ ద్వారా గత రెండు రోజుల పాటు శిక్షణ కొనసాగింది. విద్యార్థులు తాము అభివృద్ధి చేసిన ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడంలో భాగంగా శుక్రవారం రోజంతా కళాశాలలో ఉండి పూర్తి చేశారు. కోడింగ్ కార్యక్రమంతో పాటు విద్యార్థులకు టగ్ ఆఫ్ వార్, క్యాంప్ ఫైర్, డ్యాన్సలు, టంగ్ ట్విస్టర్, డైలాగ్ డెలివరీ మరియు ఇతర ఒత్తిడిని తగ్గించే కార్యకలాపాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోటీల విజేతలకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ డాక్టర్ కేసలి అప్పారావు, బోధి మాట్లాడుతూ శాశ్వత అనుభవం విద్యార్థులకు నిజ జీవితంలో డెడ్‌లైన్‌ల రుచిని అందించిందన్నారు. కళాశాల సెక్రటరీ, మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బోధి జాడే లిమిటెడ్ కెనడా నుంచి హుయిజాంగ్ యాంగ్, సీనియర్ డైరెక్టర్, పొల్యూషన్స్ ఆర్కిటెక్చర్, క్రోగర్ టెక్నాలజీ, క్రోగర్ ఇంక్, సిన్సినాటి అమెరికా నుంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, ప్రొగ్రామ్ కన్వీనర్ సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవ రావు, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాట శిబిరంపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం పంచాయతీ యాతపేట సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరంపై శనివారం రాత్రి ఎచ్చెర్ల ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. 11 మందిపై కేసు నమోదు చేసి రూ.1.59 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



చిన్నబల్లిపుట్టుగ వద్ద శేఖర్ మృతదేహం

కవిటి: మండలంలోని పెద్దబల్లిపుట్టుగకు చెందిన బచ్చల శేఖర్(32) అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేఖర్‌కు పదమూడేళ్లక్రితం పుష్పలతతో వివాహం జరిగింది. వీరికి తొమ్మిదేళ్ల బాబు దీక్షిత్, ఏడేళ్ల పాప వైష్ణవి ఉన్నారు. శేఖర్ విశాఖపట్నంలో కూలి పనులు చేస్తుండేవాడు. ఈ నెల 4న విశాఖ నుంచి స్వగ్రామం వచ్చాడు. అప్పటి నుంచి జోరుగా మద్యంసేవిస్తూ ఉన్నాడు. శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో మద్యం తాగి బయటకు వెళ్లిపోయి రాత్రంతా ఇంటికి చేరలేదు. శనివారం ఉదయం చిన్నబల్లిపుట్టుగ సమీపంలో కంకరరోడ్డు పక్కన శేఖర్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవపంచనామా నిర్వహించారు. ఎస్ఐ కె.రాము దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



లారీని క్రేన్‌తో తీస్తున్న దృశ్యం

మందస: మండలంలోని బిన్నళమదనాపురం జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాకుళం వైపు నుంచి ఒడిశా వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ రాహుల్‌సింగ్, క్లీనర్ రామేశ్వర్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న నేషనల్ హైవే సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. వీరిద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో టెక్కలిలోని జిల్లా ఆరోగ్య ఆసుపత్రికి తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఏపీ జేఏసీ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని రెవెన్యూ వసతి గృహం వద్ద నల్లబ్యాడ్జీలు, నల్ల కండువాలు ధరించి ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

యతిరాజు భాగవతార్‌కు సత్కారం



యతిరాజును సత్కరిస్తున్న సర్పంచ్, నిర్వాహకులు

ఇచ్ఛాపురం రూరల్: ప్రముఖ హరికథా భాగవతార్, ఉగాది నంది పురస్కార అవార్డు గ్రహీత బి.యతిరాజు భాగవతార్‌ను శనివారం ఈదుపురంలో ఘనంగా సత్కరించారు. శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఆయన కథాగానం సాగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్ నర్తు వరప్రసాదరావు యాదవ్ ఆధ్వర్యంలో పూజా కమిటీ నిర్వాహకులు యతిరాజు భాగవతార్‌తో పాటు వాయిద్య సహాయకులు సుబ్బారావు(హార్మోనియం), దున్న జోగారావు(మృదంగం)లను సన్మానించారు.

సొంతూరికి స్వస్థత

సాటిలేని ఉదాత్తత



ప్రభుత్వాసుపత్రి(పీహెచ్‌సీ) కోసం ఉచితంగా ఇచ్చిన స్థలం

- ప్రభుత్వ ఆస్పత్రి కోసం ఎకరా స్థలం వితరణ
- విలువ రూ.కోటికిపైమాటే
- ఉదారత చాటుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు కిల్లి వెంకటగోపాల్ సత్యనారాయణ
- పురుషోత్తపురంలో రెండో పీహెచ్‌సీ నిర్మాణం కోసం స్థల దానం
- నేడు ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గజం స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసే రోజులివి. గ్రామంలో సెంటు జాగా ప్రభుత్వానికి ఇవ్వాలంటే ప్రాణం ఒప్పని రోజులివి. అలాంటిది రూ.కోటికి పైగా విలువైన ఎకరం భూమిని ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చి దాతృత్వం చాటుకుంది పురుషోత్తపురం గ్రామానికి చెందిన కిల్లి వెంకటగోపాల్ సత్యనారాయణ కుటుంబం. పుట్టిన ఊరికి, గ్రామంలో ఉన్న ప్రజలకు ఏదో మంచి చేయాలన్న తపన వారిది. ఊరి ప్రజల ఆరోగ్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయించి, దానికి అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చి మానవత్వం చాటుకుంది.

ఒక్కసారి సర్పంచ్‌గా అవకాశం వస్తే అధికారాన్ని అడ్డు పెట్టుకుని పైసలు సంపాదించడం.. పైరవీలు చేసుకోవడం చాలా మంది చేసే పని. కానీ అవకాశం ఇచ్చిన ప్రజలకు మేలు చేయాలని తలచేది కొందరే. గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా శ్రమిస్తా అంటూ చేసిన వాగ్దానం కోసం నాటి నుంచి నేటి వరకు గ్రామ అభివృద్ధే తన లక్ష్యమంటూ.. గ్రామ ప్రజలే తన కుటుంబం అంటూ కంటికి రెప్పలా చూసుకోవడం కిల్లి వెంకట గోపాల్ సత్యనారాయణ కుటుంబం ప్రత్యేకత. విద్య, వైద్యం, ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత ఇవ్వడంలో వారికి ఎముక లేని చేయి అని స్థానికుల మాట. కోవిడ్ సమయంలోనూ చాలా సేవ చేశారు.

ఆస్పత్రి కోసం..

సరుబుజ్జిలి మండలంలో ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) ఉంది. కానీ, మరో పీహెచ్‌సీ అవసరం ఉంది. అందుబాటులో ప్రభుత్వాస్పత్రులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. గత ప్రభుత్వంలో మరో పీహెచ్‌సీ కోసం ప్రయత్నించినా నాటి ఎమ్మెల్యే కూన రవికుమార్ సహకరించ లేదు. దీంతో అక్కడ ఆస్పత్రి ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చింది. విద్య, వైద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతో స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవ తీసుకున్నారు. ప్రభుత్వ స్థాయిలో ఒత్తిడి చేసి సరుబుజ్జిలి మండలానికి మరో పీహెచ్‌సీ మంజూరు చేయించారు. దాన్ని పురుషోత్తపురంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దానికి స్థలం అవసరమైతే కిల్లి వెంకట గోపాల్ సత్యనారాయణ ముందుకొచ్చి తనకున్న ఎకరం భూమిని తన తండ్రి కిల్లి వెంకట అప్పలనాయుడు జ్ఞాపకార్థం ప్రభుత్వాస్పత్రి నిర్మాణం కోసం విరాళంగా ఇచ్చేశారు. దాని విలువ ప్రస్తుతం కోటికి పైగా ఉంది. స్థలం సిద్ధం కావడంతో ప్రభుత్వం రూ.2.30 కోట్ల నిధులు విడుదల చేసింది. టెండర్ల ద్వారా కాంట్రాక్ట్‌ను కూడా ఖరారు చేసింది. నాడు-నేడు కింద ఆస్పత్రి నిర్మాణం చేపడుతోంది. ఈ కార్యక్రమానికి ఆదివారం స్పీకర్ తమ్మినేని సీతారాం చేతులు మీదుగా శంకుస్థాపన జరగనుంది.

పదాన్యులూ సాక్షి వందనం

సాయం చేయడంలో అందవేసిన చేయి..



కిల్లి వెంకట గోపాల్ సత్యనారాయణ

సరుబుజ్జిలి మండలంలో కిల్లి వెంకట గోపాల్ సత్యనారాయణ కుటుంబం గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. పురుషోత్తపురం గ్రామం కేంద్రంగా 38 ఏళ్లగా వారు రాజకీయాలు చేస్తున్నారు. వెంకట గోపాల్ సత్యనారాయణ తండ్రి కిల్లి వెంకట అప్పలనాయుడు నుంచి ప్రారంభమైన రాజకీయం నేటికీ కొనసాగుతోంది. ఆ ఇంటిలో ముగ్గురు ఎంపీపీ పదవులు చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రి కోసం రూ.కోటికి పైగా విలువైన స్థలమిచ్చిన వెంకట గోపాల్ సత్యనారాయణ 1988లో సర్పంచ్‌గా రాజకీయ ప్రవేశం చేశారు. నాటి నుంచి నేటి వరకు ఓటమి లేకుండా పదవులు చేపట్టారు. ప్రస్తుతం ఈయన భార్య కిల్లి రమాదేవి సరుబుజ్జిలి ఎంపీపీగా ఉండగా, ఈయన వదిన కిల్లి రాజ్యలక్ష్మి పురుషోత్తపురం గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. గ్రామానికి ఏ అవసరం ఉన్నా సమకూర్చడం వారి నైజం. సేవ చేయడమే అభిమతం కావడంతో ప్రజలు కూడా ఆ కుటుంబాన్ని ఆదరిస్తున్నారు. ఆదరిస్తున్న ప్రజలకు ఏదో ఒకటి చేయాలని నిత్యం పరితపిస్తున్నారు ఈ కుటుంబ సభ్యులు. తాగునీరు, రహదారుల సదుపాయాలు కల్పించారు. గ్రామానికి ఉపయోగపడే పనులే కాకుండా వ్యక్తిగతంగా సాయం చేస్తున్నారు. వైద్యం కోసం అవసరమైతే ఆర్థికంగా సహకరిస్తున్నారు. నిరుపేద ఆడపిల్లల పెళ్లి కోసం తమ వంతు సాయం చేసి ఉదారతను చాటుకుంటున్నారు.

10న అప్రెంటీస్ ట్రైనీస్ పోస్టులకు ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమల్లో పనిచేందుకు అప్రెంటీస్ ట్రైనీస్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ సాయిశ్రీనివాస్ తెలిపారు. ఎచ్చెర్ల స్కిల్ కాలేజ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ బీఎస్సీ/ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయోలజీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వార్షిక వేతనం రూ.2.1 లక్షల నుంచి రూ.2.6 లక్షలు వరకు ఉంటుందని చెప్పారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీల్లో కనీసం 60 శాతం మార్కు లు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 10న శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని నెహ్రూయువ కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజ రుకావచ్చని తెలిపారు. అభ్యర్థులు ముందుగా 'ఆర్‌బీ.జీవై/ఎక్స్9ఓఈ' వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కు 8317652552, 6301045132 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మత్తుతో జీవితం చిత్తు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: మాదకద్రవ్యాలు, మత్తు యువత జీవితాలను చిత్తు చేస్తున్నాయని శ్రీకాకుళం డీఎస్పీ ఎం.మహేంద్ర అన్నారు. శ్రీకాకుళంలోని మహిళా కళాశాలలో జేసీఐ శ్రీకాకుళం సన్ రైజర్స్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ క్లబ్, ఇండియన్ పిడియాట్రిక్స్ అసోసియేషన్ శ్రీకాకుళం సంయుక్తంగా మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కొందరు యువత డ్రగ్స్ కోసం నేరాలు చేసేందుకు కూడా వెనకాడడం లేదన్నారు. ఒంటరిగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చుకుంటున్నారని చెప్పారు. ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్‌ను విక్రయిస్తున్నా, కలిగి ఉన్నా వెంటనే 14500 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. చిన్నపిల్లల వైద్యనిపుణులు ధర్మాన లక్ష్మీనారాయణ, కొంచాడ సోమేశ్వరరావులు మాట్లాడుతూ డ్రగ్స్ బారిన పడిన వారిని బయటకు తీసుకొచ్చేందుకు కుటుంబ సభ్యులు, స్నేహితులు చొరవ తీసుకోవాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై యువతకు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరాములు, మంత్రి వెంకటస్వామి, జేసీఐ ప్రతినిధులు సంతోష్ దూసి, వెంకట సతీష్, ప్రవీణ్, వడ్లపాటి శిరీష, బగాది వెంకట్, మీనాకుమారి, వైద్యులు మందుల మోహన్ రావు, విజయ్ కుమార్, ఐ.శిరీష, నరేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం పంచాయతీ పరిధి చిన్నశ్రీరాంపురం గ్రామానికి చెందిన లండ భూషయ్య ఐదేళ్ల కుమారుడు యోగేంద్రకు న్యూరో బ్లాస్టోమా అనే ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి సోకింది. ఈ వ్యాధి నయం కావాలంటే సుమారు రూ.25 లక్షల వరకు ఖర్చవుతుందని, దాతలు సహకరించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నట్లు 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి పెద్ద ఎత్తున దాతలు స్పందిస్తున్నారు. కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అంతా కలిసి రూ.1,03,500లు ఆర్థిక సాయాన్ని వైజాగ్ పినాకిల్ ఆస్పత్రికి శనివారం వెళ్లి అందించారు. ఉద్దానానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు కూడా రూ.20వేల నగదుతో పాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు.

నైజీరియన్ ముఠా సభ్యుడి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ ఈశ్వరప్రసాద్

ఇచ్ఛాపురం:

ఇచ్ఛాపురం పోలీసులు ఆన్‌లైన్ మోసగాడిని పట్టుకున్నారు. నైజీరియన్ ముఠాతో కలిసి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న ఢిల్లీకి చెందిన ఈ వ్యక్తిని ఢిల్లీలోనే అదుపులోకి తీసుకుని శనివారం ఇచ్ఛాపురం తీసుకువచ్చా రు. ఈ సందర్భంగా శనివారం తన కార్యాలయంలో సీఐ ఈశ్వరప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గత ఏడాది ఇచ్ఛాపురానికి చెందిన తిప్పన సుజాతరెడ్డి అనే యువతి మ్యాట్రిమోనీ ఆన్‌లైన్‌లో పేరుని రిజిస్టర్ చేసుకున్నారు. అయితే ఆ సైట్ పేరుతో నైజీరియన్ ముఠా సభ్యులు తన ఖాతా నుంచి రూ.22.80 లక్షల సొమ్ము కాజేశారని ఆమె ఇచ్ఛాపురం పోలీసులకు గత ఆగస్టులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్రైమ్ సి బ్బంది అప్పటి నుంచి దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా ఆ ముఠాలోని కుల్వంత్ సింగ్ అనే ఒకడు ఢిల్లీలోని తిలక్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాడని తెలుసుకుని అక్కడకు వెళ్లి అదు పులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం ఇచ్ఛాపురం తీసుకువచ్చారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడితే 1930 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భక్తిభావంతో 'రన్‌ఫర్ ఫర్ జీసస్'



శ్రీకాకుళంలో రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్/రణస్థలం: ఏసుక్రీస్తు సజీవుడై తిరిగి వచ్చిన నేపథ్యాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీకాకుళంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. దైవశక్తి ప్రార్థనా మందిరం, సూర్యమహల్ కూడలి మీదుగా పొట్టి శ్రీరాములు కూడలి, ఏడురోడ్లకూడలి, డే అండ్ నైట్ కూడలి, కీస్టోన్ చర్చి వరకు రన్ కొనసాగింది. కార్యక్రమంలో పాస్టర్ రెవ.కృపానందం, పాస్టర్ జాకబ్ అధికారి, రెవ.జాన్ జీవన్ తదితరులు పాల్గొన్నారు. రణస్థలం రామతీర్థాలు కూడలి నుంచి డబ్ల్యూఎంఈ చర్చి వరకు రణస్థలం, లావేరు మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రెసిడెంట్ సీహెచ్ రూబెన్, సెక్రటరీ డి.రత్నం, ట్రెజరర్ కె.సన్యాసిరావు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అంగీకారం



పోర్టు రోడ్డు ప్రభావిత తలగాం రైతులతో టెక్కలిలో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: తమ ప్రాంత అభివృద్ధికి తాము అడ్డంకులు సృష్టించబోమని, రైతులకు న్యాయం జరిగేలా పరిహారం ఇస్తే తమకు అన్నీ అంగీకారమేనని టెక్కలి మండలం తలగాం గ్రామానికి చెందిన పో ర్టు రోడ్డు ప్రభావిత రైతులు తెలిపారు. మూలపేట పోర్టు రోడ్డు నిర్మాణానికి సంబంధించి టెక్కలి మండలం తలగాం గ్రామానికి చెందిన పోర్టు రోడ్డు ప్రభావిత రైతులతో శనివారం టెక్కలిలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల తరఫున హనుమంతు వెంకటేశ్వరరావు, కేకే రామయ్య తదితరులు మాట్లాడుతూ.. పోర్టుతో తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందంటే తాము అడ్డు చెప్పబోమ న్నారు. అయితే పరిహారం విషయంలో న్యాయం జరగాలని స్పష్టం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ...ఈ ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు లేకపోవడంతో ఎంతో మంది వలస బాట పడుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో ఈ ప్రాంతంలో పోర్టు నిర్మాణానికి చర్యలు చేపడుతోందని అన్నారు. పోర్టు నిర్మాణం విషయంలో భూములు ఇస్తున్న రైతులకు తాత్కాలికంగా నష్టం ఉన్నప్పటికీ భవిష్యత్‌లో ఎన్నో మంచి ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించిన అనంతరం మరో రెండు రోజుల్లో తదుపరి సమావేశం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దారు కిశోర్, ఏఓ గిరిబాబు తదితరులు ఉన్నారు.

19న మూలపేట పోర్టుకు శంకుస్థాపన



భావనపాడు పోర్టు

- సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా కార్యక్రమం
- వివరాలు వెల్లడించిన స్పీకర్ తమ్మినేని, మంత్రి అప్పలరాజు

అరసవల్లి: జిల్లాకు తలమానికం కానున్న మూలపేట (భావనపాడు) పోర్టు శంకుస్థాపన ఈ నెల 19న జరగనుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి టెక్కలి నియోజకవర్గానికి రానున్నారని అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజులు సంయుక్తంగా తెలియజేశారు. వారు శనివారం సాయంత్రం జెడ్పీ ఆవరణ లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నో దశాబ్దాలుగా ఎన్నికల హామీగా మిగిలిపోయిన పోర్టు నిర్మాణాన్ని వైఎస్ జగన్ చేతల్లో చేసి చూపిస్తున్నారని అన్నారు. ఈ పోర్టుతో జిల్లా స్వరూపం మారనుందని, వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందని తెలిపారు. టెక్కలి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభలో సీఎం పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ప్రకటించారు. ఈ పోర్టు నిర్మాణంలో భాగంగా మూలపేట ప్రాంత వాసులకు జిల్లావాసులు రుణపడి ఉంటారని, అలాగే దండుగోపాలపురం నుంచి రైల్వేలైనును, అలాగే ఎన్‌హెచ్–16 నుంచి పోర్టు వరకు జాతీయ రహదారి నిర్మాణం చేసేందుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు ముందుకు వచ్చారని తెలిపారు. భూ సేకరణ విషయంలో కూడా ఎక్కడా లేని విధంగా ఎకరాకు రూ.25 లక్షల చొప్పున రైతులకు అందజేస్తున్నట్లుగా మంత్రి ప్రకటించారు. అలాగే జిల్లాలో ఎన్నాళ్ల నుంచో శిలాఫలకాలకే పరిమితమైన ఆమదాలవలస నియోజకవర్గంలోని బలసలరేవు వంతెన శంకుస్థాపన చేయనున్నారని, అలాగే మడ్డువలస ఫేజ్–2 కూడా సిద్ధం చేస్తున్నారని, ఇక పాతపట్నం నియోజకవర్గంలో హిరమండలం వద్ద లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కూడా సీఎం చేతులమీదుగా శంకుస్థాపన జరుగుతుందని స్పీకర్ తమ్మినేని పేర్కొన్నారు. ప్రస్తుతానికి షెడ్యూల్‌లో లేనప్పటికీ ఎచ్చెర్ల నియోజకవర్గంలో బుడగట్లపాలెంలో షిప్పింగ్ హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేసే అవకాశం ఉందని మంత్రి అప్పలరాజు తెలియజేశారు. ఇక 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ జనం ఎప్పుడో జగన్‌తో పొత్తు పెట్టుకున్నారని, ఇందులో ఏ మాత్రం డౌట్ లేదని, రానున్న ఎన్నికల్లోనూ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని స్పీకర్ తమ్మినేని స్పష్టం చేశారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రధానంగా రద్దీగా ఉండే పార్వతీపురం – సాలూరు నియోజకవర్గాలను అనుసంధానం చేస్తూ ఒడిశాకు సాగే బీటీ రోడ్డు విస్తరణ పనులతో పాటు కాలువల పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. చినబోగిలి మీదుగా మక్కువ దుగ్గేరు మీదుగా ఒడిశాకు వెళ్లే రహదారి విస్తరణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు చినబోగిలి నుండి మక్కువ వరకూ మొదటి విడతగా జగనన్న ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేయగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జోగారావు సంతృప్తి వ్యక్తం చేస్తూ అనుకున్న సమయంలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సీనియర్ నాయకులు ఆర్వీ పార్థసారధి, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి



వాహనచోదకులతో మాట్లాడుతున్న ఎస్ఐ నీలకంఠం

సీతానగరం: మండలంలోని రోడ్డు ప్రమాదాలు నివారణకు వాహన చోదకులు సహకరించాలని ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. రోడ్డు ప్రమాదాల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర రహదారిలో ఆర్వోబీ వద్ద వాహన చోదకులు, విద్యార్థులతో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వాహనాలను నడపడం, మొబైల్‌లో మాట్లాడటం, అనుభవం లేని, చిన్న పిల్లలు డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డేగా గుర్తించి వాహనాలు తనిఖీ చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర రహదారిలో ప్రమాదాలు నివారణకు, ప్రమాదాలకు కారణమైన వాహనాల్ని గుర్తించడానికి ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో ఎనర్జీ అసిస్టెంట్ దుర్మరణం



శివంగి వాసు(ఫైల్)

కవిటి: రెక్కలు ముక్కలు చేసుకుని కష్టంతో చదివించిన తమ బిడ్డ ప్రభుత్వ ఉద్యోగి అయ్యాడన్న ఆనందాన్ని ఆ పేద తల్లిదండ్రులకు విధి దూరం చేసింది. బెజ్జిపుట్టుగ సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంటుగా పని చేస్తున్న శివంగి వాసు శనివారం విధినిర్వహణలో విద్యుత్ షాక్‌తో దుర్మరణం పాలయ్యాడు. దీంతో స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి. విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో వాసు చురుగ్గా ఉండేవారు. కొద్ది నెలల్లోనే ఇరుగుపొరుగు సచివాలయాల్లో కూడా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించేవాడు. శనివారం సాయంత్రం విధి నిర్వహణలో భాగంగా పెద్దకర్రివానిపాలెం వెళ్లాడు. అక్కడ ఏబీస్విచ్ ను ఆపరేట్ చేసే సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. షాక్ తగిలి మృతిచెందాడా లేక విద్యుత్ స్తంభం నుంచి జారిపడి మృతిచెందాడా అన్న విషయంపై స్పష్టత లేదు. ఒక్కసారిగా విద్యుత్ లైన్ నుంచి నిప్పురవ్వలు రాలి పడుతూ పెద్దశబ్దం రావడంతో ఇళ్లలోని వారు బయటకు వచ్చి చూశారు. నేలకొరిగిన వాసును కవిటి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న వాసు తల్లిదండ్రులు రాములమ్మ,లచ్చయ్య ఆస్పత్రి వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామసచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పొల్లాయి అశోక్, వైద్యశాఖ ఉద్యోగి పొల్లాయి రుద్రయ్యలు ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.



కవిటి ఆస్పత్రిలో వాసు మృతదేహం